నమస్తే తెలంగాణ
నాగర్‌కర్నూల్
5 | మహబూబ్‌నగర్, మంగళవారం 15 అక్టోబర్ 2024 | NAGARKURNOOL

అడిగితే స్పెషల్ అంటున్నారు..

ఎక్స్‌ప్రెస్‌లలో ప్రయాణికులు ఎక్కువగా ఉంటారని సూపర్ లగ్జరీ బస్సుల్లో హైదరాబాద్‌కు వెళ్తుంటాను. ఈ రోజు అదే బస్సు ఎక్కితే రూ.220 టికెట్ బదులుగా రూ.360 తీసుకున్నారు. ఇదేమిటని అడిగితే దసరా స్పెషల్ అని చెబుతున్నారు. పండుగ సందర్భంగా ఆర్టీసీ కూడా ప్రైవేట్ ట్రావెల్స్ మాదిరి చార్జీలు పెంచడం సరికాదు. ఏ మాత్రం సమాచారం లేకుండా ఇలా టికెట్ల రేట్లు పెంచడం బాగాలేదు.

- సురేష్, ప్రయాణికుడు

బస్సు చార్జీలను తగ్గించాలి : బీరం

కొల్లాపూర్, అక్టోబర్ 14 : కాంగ్రెస్ ప్రభుత్వం స్పెషల్ బస్సుల పేరిట చార్జీలను పెంచి సామాన్యుల నడ్డీ విరుస్తోందని మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి ఆగ్రహం చెందారు. కొల్లాపూర్ నుంచి జీవ నోపాధికి, పనుల నిమిత్తం చాలా మంది హైదరాబాద్ వెళ్తుంటారని, అలాంటి వారికి బస్సు చార్జీలు గుదిబండగా మారాయన్నారు. కొల్లాపూర్ నుంచి హైదరాబాద్‌కు రూ. 360 చార్జీ చేయడమంటే.. పేదలకు ఆర్టీసీ సేవలను దూరం చేయడమేనన్నారు. బస్సు చార్జీల పెంపుదలపై ప్రభుత్వం పునరాలోచన చేయాలని కోరారు.

నాగర్‌కర్నూల్ నుంచి హైదరాబాద్‌కు వెళ్లే బస్సు అద్దంపై స్పెషల్ సర్వీస్ అని ఉన్న దృశ్యం



అధికచార్జీలతో ఇష్యూ చేసిన టికెట్లు

ఆర్టీసీ స్పెషల్ బాదుడు

ఆర్టీసీ.. ప్రజారవాణా పేరిట సేవ చేస్తున్న సంస్థగా పేరు గడించింది. అలాంటి సంస్థ దసరా సందర్భంగా అదనపు చార్జీలతో పేదల జేబులకు చిల్లులు పెడుతున్నది. ముఖ్యంగా నాగర్‌కర్నూల్, కొల్లాపూర్ నుంచి హైదరాబాద్ రూట్‌లో ప్రయాణికులు తేరుకునేలోగా టికెట్ చేతుల్లో పెట్టి పెంచిన ధరలను వసూలు చేయడం గమనార్హం. ఒకటే సారి రూ.వందల్లో ధరలు పెంచడంతో ప్రయాణికులు అవాక్కవుతున్నారు. ఉచితం పేరిట మహిళలకు అందిస్తున్న ప్రయాణ భారాన్ని పేదలపై రుద్దేందుకు ప్రభుత్వం ఆర్టీసీని ఎంచుకున్నదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

– నాగర్‌కర్నూల్, అక్టోబర్ 14 (నమస్తే తెలంగాణ)

- పండుగ పేరుతో అదనపు వడ్డన
- ప్రత్యేక బస్సుల పేరుతో సర్కారు చార్జీల పెంపు
- సాధారణ రోజుల్లోకంటే రూ.80 నుంచి రూ.140 ఎక్కువగా..
- అవాక్కవుతున్న ప్రయాణికులు

పేదలకు దసరా పండుగ సంబురాన్ని తెస్తే.. ఆర్టీసీకి ఆదాయాన్ని తీసుకొచ్చింది. ఇదేదో ప్రయాణికులు అధికంగా ఎక్కడం వల్ల వచ్చింది కాదండి. అదనపు చార్జీలతో ముక్కుపిండి వసూలు చేశారు. పండుగ వేళ నాగర్‌కర్నూల్ నుంచి హైదరాబాద్.., హైదరాబాద్ నుంచి నాగర్‌కర్నూలుకు వచ్చే బస్సుల్లో ఆర్టీసీ యాజమాన్యం ఊహించని స్థాయిలో టికెట్ల రేట్లను పెంచింది. సూపర్ లగ్జరీ బస్సులో సాధారణ రోజుల్లో హైదరాబాద్‌కు రూ.220 ఉండగా.. పండుగ వేళ ఏకంగా రూ.140 పెంచి రూ.360 చొప్పున వసూలు చేస్తున్నారు. ఎక్స్‌ప్రెస్ బస్సులో రూ.180 ఉండగా.. ప్రత్యేక బస్సు పేరిట ఇప్పుడు రూ.260కి చేరుకున్నది. దాదాపుగా రూ.80 పెంచడం విస్మయం కలిగిస్తున్నది. ఇదిలా ఉండగా, బస్సుల సంఖ్యను పెంచుతున్నట్లు ఆర్టీసీ అధికారులు పేరుకే చెబుతున్నా.. పూర్తిస్థాయిలో సమాచారం మాత్రం ఇవ్వడం లేదు. ఇక హైదరాబాద్‌లో తిరిగే సిటీ బస్సులను సైతం నాగర్‌కర్నూల్, కొల్లాపూర్ వంటి ప్రాంతాలకు నడిపిస్తున్నారు. దసరా ముందు రోజు నుంచి సోమవారం వరకు ఆర్టీసీ సంస్థ ఇలా అదనపు చార్జీలను వసూలు చేయడంతో పేదలపై మోయలేనంత భారం పడింది. ముందస్తు సమాచారం లేకుండా టికెట్ల ధరలు పెంచడమేమిటని ప్రశ్నిస్తున్నారు. పండుగ కోసం ఊళ్లకు వచ్చే, తిరిగి వెళ్లే ప్రజలకు ఆర్టీసీ చుక్కలు చూపించింది. బస్సు ఎక్కి టికెట్ తీసుకున్నాక చార్జీని చూసిన చాలా మంది కంగుతిన్నారు. ఇదేమిటని అడిగితే దసరా స్పెషల్ బస్సులంటూ కండక్టర్లు, డ్రైవర్లు సమాధానం విష్వడం ప్రయాణికులను ఆశ్చర్యానికి గురిచేసింది. ఎప్పుడైనా జాతరలు, సుదూర పర్యాటక ప్రాంతాలకు వేసే ప్రత్యేక బస్సుల్లో ఇలా చార్జీలు పెంచడం సాధారణంగా చూస్తుంటాం. సాధారణంగా హైదరాబాద్–నాగర్‌కర్నూల్ రూట్‌లో దసరా స్పెషల్ అంటూ చార్జీలు వసూలు చేయడంతో విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని డిపోల నుంచి హైదరాబాద్ వెళ్లే బస్సులకు కాగితాలను అతికించి దసరా స్పెషల్ అంటూ రాశారు. బస్సులు కూడా పూర్తి స్థాయిలో లేక పోవడంతో టికెట్లు దొరకక నిలబడి వెళ్తుండడం కనిపించింది. ఇక బస్టాండ్లలో సీట్ల కోసం ప్రయాణికులు ఒక్కసారిగా బస్సుల వైపు ప్రమాదకరంగా పరుగెత్తడం ఆందోళన కలిగిస్తున్నది. ఆర్టీసీ సంస్థకు ఆదాయం పెంచే ఆలోచన బాగున్నా.. పేదల సంక్షేమాన్ని విస్మరించింది. బస్సులను అదనంగా ఏర్పాటు చేసి ఉంటే బాగుండేది. మహాలక్ష్మి పథకం పేరిట మహిళలకు ఉచిత ప్రయాణం అంటున్న ప్రభుత్వం.. దసరా పేరిట ప్రైవేట్ ట్రావెల్స్ మాదిరిగా సేవకు బదులు ఆదాయ రాబడి తీసుకొచ్చేలా వ్యవహరించడం విడ్డూరంగా ప్రజలు అభివర్ణిస్తున్నారు. కాగా, ప్రయాణికులు దిగేం దుకు, ఎక్కేం దుకు స్టాప్‌లలో, గ్రామాలకు వెళ్లే రోడ్లపై బస్సులను ఆపడంలేదు. మండల కేంద్రాలు, స్టాపుల్లోనే బస్సులు ఆపుతామంటూ డ్రైవర్లు, కండక్టర్లు నిర్లక్ష్యంగా సమాధానమిస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఏదేమైనా ఆదాయం కోసం ఆర్టీసీ సంస్థ పండుగ వేళ టికెట్ రేట్లను పెంచడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

అయోమయంలో ప్రయాణికులు

అచ్చంపేటటౌన్, అక్టోబర్ 14 : అదనపు చార్జీలతో ప్రయాణికులు అయోమయానికి గురవుతున్నారు. పండుగను సొంత ఊరిలో జరుపుకోవాలనే ఉద్దేశంతో వచ్చిన ప్రజలు హైదరాబాద్‌కు తిరుగు పయనమయ్యారు. ఈ క్రమంలో ఆర్టీసీ సంస్థ అచ్చంపేట నుంచి హైదరాబాద్‌కు ఏకంగా రూ.110 పెంచింది. గతంలో ఈ రూట్లో టికెట్ ధర రూ.210 ఉండగా.. ప్రస్తుతం స్పెషల్ బస్సుల పేరిట రూ.330 వసూలు చేస్తున్నదని ప్రయాణికులు వాపోతున్నారు. అలాగే డిపోలో బస్సులు లేక పిల్లలు, పెద్దలు, విద్యార్థులు ఇబ్బందులకు గురయ్యారు. బస్సుల కోసం గంటల తరబడి పడిగాపులు కాయాల్సిన పరిస్థితి ఏర్పడింది.

వీపనగండ్ల మండలం కల్వరాలకు చెందిన పేద విద్యార్థిని బీ.గౌరికి మెడిసిన్‌లో సీటు వచ్చింది. కాగా, చదువుకు ఫీజు చెల్లించలేని స్థితిలో ఉండగా.. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్ఫూర్తితో విద్యార్థిని చదువు కోసం ఆర్థిక సాయం అందజేసేందుకు అమెరికాలో నివసిస్తున్న దూడల వెంకట్ ముందుకొచ్చారు. తన జన్మదినం సందర్భంగా మొదటి సంవత్సరం ఫీజును అందిస్తానని ఇచ్చిన మాట మేరకు వెంకట్ తన కుటుంబ సభ్యుల ద్వారా హైదరాబాద్‌లోని నందినగర్‌లో కేటీఆర్ ఆధ్వర్యంలో గౌరి కుటుంబానికి రూ.1,65,000 చెక్కును అందజేశారు.

పీహెచ్‌సీలో ప్రసవించిన డాక్టర్

- ఆదర్శంగా నిలిచిన వైద్యురాలిని అభినందించిన వనపర్తి డీఎం హెచ్‌వో

డాక్టర్ సౌజన్యలతను అభినందిస్తున్న డీఎంహెచ్‌వో

మదనాపురం, అక్టోబర్ 14 : ప్రభుత్వ దవాఖానల్లో సురక్షితమైన సాధారణ ప్రసవాలు చేస్తున్నట్లు డీఎంహెచ్‌వో జయచంద్రమోహన్ తెలిపారు. కమాలోద్దీన్‌పూర్ పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ సౌజన్యలతకు సోమవారం కొత్తకోట పీహెచ్‌సీలో సాధారణ ప్రసవం చేశారు. విషయం తెలుసుకున్న డీఎం హెచ్‌వో కొత్తకోట పీహెచ్‌సీకి చేరుకొని సౌజన్యలతకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జయచంద్రమోహన్ మాట్లాడుతూ ప్రభుత్వ దవాఖానల్లో సురక్షితమైన కాన్పులు జరుగుతాయని.. కానీ, అనవసరంగా ప్రైవేట్ వైద్య శాలలకు వెళ్లి డబ్బుల తోపాటు ఆరోగ్యం పాడు చేసుకుంటున్నారన్నారు. ప్రైవేట్‌లో అవసరం లేకున్నా సిజేరియన్ చేసి డబ్బులు దండుకుంటున్నారన్నారు. ప్రభుత్వ దవాఖానల్లో అనుభవజ్ఞులైన సిబ్బంది ఉండడంతో సాధారణ ప్రసవాలకే ప్రాధాన్యత ఇస్తారన్నారు. డాక్టర్ సౌజన్యలత రోల్‌మోడల్‌గా తీసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో వైద్యులు, సిబ్బంది ఉన్నారు.

నిరుపేదలకు నిరాశే..!

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ వద్ద ప్రజాపాలనకు దరఖాస్తులు చేసేందుకు బారులు తీరిన జనం (ఫైల్)

- కొత్త రేషన్ కార్డుల కోసం తప్పని నిరీక్షణ
- కమిటీలు, సర్వేల పేరుతో సర్కారు కాలయాపన
- ముగిసిన ఫ్యామిలీ డిజిటల్ కార్డుల సర్వే
- ఉమ్మడి జిల్లాలో ఎఫ్ఎస్‌సీలో పేర్ల తొలగింపు
- పది నెలల్లో 63 కార్డులు, 2,399 మంది కుటుంబ సభ్యుల పేర్లు డిలీట్
- ఆగ్రహంలో ప్రజలు

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, అక్టోబర్ 14 : రాష్ట్ర ప్రభుత్వం గతేడాది డిసెంబర్ చివరి వారంలో ప్రజాపాలన పేరిట దరఖాస్తులు స్వీకరించింది. వాటిలో ఆన్‌లైన్ చేసిన దరఖాస్తుల్లో ఎక్కువగా రేషన్‌కార్డులకు సంబంధించినవే ఉన్నాయి. వీటికి మోక్షం లభించలేదు. ఈ నేపథ్యంలో అక్టోబర్ 2 నుంచి రేషన్ కార్డుల జారీకి దరఖాస్తులు స్వీకరిస్తామని మరోసారి ప్రకటించింది. తీరా అది కూడా నోచుకోకపోవడంతో వేలాదిమంది నిరుపేదలకు నిరాశే మిగిలింది. జిల్లాలో ఎంపిక చేసిన మున్సిపల్ వార్డులు, పంచాయతీల్లో 'ఫ్యామిలీ డిజిటల్ కార్డుల సర్వే' పైలట్ ప్రాజెక్టుగా చేపట్టింది. ఇది ఈనెల 8వ తేదీతో ముగిసింది. దీని తర్వాతైనా దరఖాస్తులు స్వీకరిస్తారేమోనని చాలా మంది ఆశగా ఎదురుచూస్తున్నా.. కొత్త కార్డులు సైతం జారీ చేయడం లేదు. మృతిచెందిన వారి పేర్లు రేషన్‌కార్డుల్లో వాటంతటవే తొలిగిపోయేలా సాఫ్ట్‌వేర్ ఏర్పాటు చేశారు. కానీ, పుట్టిన వారి పేర్లు మాత్రం చేర్చడం లేదు. ఉమ్మడి కుటుంబాలు వేరు సంసారం పెట్టినా కొత్త కార్డులు ఇవ్వడం లేదు.

ఈ చిత్రంలో ఉన్న అతడి పేరు రవి. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని మేకలబండ ప్రాంతానికి చెందిన వ్యక్తి. ఇతడికి భార్య శాంతిప్రియ, ముగ్గురు పిల్లలు ఉన్నారు. రేషన్ కార్డు ఉన్నా.. అందులో భార్య పేరు లేదు. ఈ నేపథ్యంలో ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ సమయంలో తన భార్య పేరును ఆహారభద్రత కార్డులో చేర్చాలని అప్లికేషన్ సమర్పించా.. ఆన్‌లైన్‌లో నమోదు కాలేదు.

నోటికాడి కూడు లాగేస్తుండ్రు..

ప్రజాపాలన ప్రభుత్వం అంటూ గొప్పలు చెబుతూనే పేదల నోటికాడి కూడును లాగేస్తుందని ఉమ్మడి జిల్లా ప్రజలు వాపోతున్నారు. ఆహార భద్రత (రేషన్) కార్డులు, కుటుంబ సభ్యుల పేర్లు తొలగిస్తే ఇందుకు ప్రత్యక్ష ఉదాహరణా నిలుస్తోందని పేర్కొంటున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం గతేడాది డిసెంబర్‌లో కొలువుతీరాక.. పేదలకు అన్ని రకాలుగా అండగా ఉండడమే తమ ఎజెండా అంటూ ప్రగల్భాలు పలికింది. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఆహార భద్రత కార్డులు జారీ చేస్తామంటూ చెప్పినా.. ఆ దిశగా ముందుకు సాగకపోగా.. ఉన్న కార్డుల్లోనూ కోత విధిస్తున్నది.

పది నెలల్లో 63 కార్డుల తొలగింపు..

రాష్ట్రవ్యాప్తంగా 33 జిల్లాల్లో కాంగ్రెస్ సర్కారు ఏర్పడిన ఈ పది నెలల కాలంలో 2,539 కార్డులు రద్దు కాగా.. 39,740 మంది కుటుంబ సభ్యుల పేర్లు తొలగించారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలో 63 రేషన్‌కార్డులు, 2,399 కుటుంబ సభ్యుల పేర్లు తీసివేశారు.

ఉమ్మడి జిల్లాలో తొలగింపు ఇలా..

- మహబూబ్‌నగర్ జిల్లాలో ఈ ఏడాది జనవరిలో 2,39,514 రేషన్‌కార్డులు, 7,89,978 మంది కుటుంబసభ్యులు ఉండగా.. అక్టోబర్‌లో 2,39,500 కార్డులు, 7,89,520 మంది కుటుంబసభ్యులకు చేరింది. ఈ లెక్కన 14 కార్డులు, 458 మంది పేర్లు తొలగించారు.
- జోగుళాంబ గద్వాల జిల్లాలో ఈ ఏడాది జనవరిలో 1,60,111 రేషన్‌కార్డులు, 5,46,355 మంది కుటుంబసభ్యులు ఉండగా.. అక్టోబర్‌లో 1,60,101 కార్డులు, 5,45,594 మంది కుటుంబసభ్యులకు చేరింది. ఈ లెక్కన 10 కార్డులు, 761 మంది పేర్లు తొలగించారు.
- నాగర్‌కర్నూల్ జిల్లాలో ఈ ఏడాది జనవరిలో 2,37,833 రేషన్‌కార్డులు, 7,50,598 మంది కుటుంబసభ్యులు ఉండగా.. అక్టోబర్‌లో 2,37,800 కార్డులు, 7,49,892 మంది కుటుంబసభ్యులకు చేరింది. ఈ లెక్కన 33 కార్డులు, 706 మంది పేర్లు తొలగించారు.
- నారాయణపేట జిల్లాలో ఈ ఏడాది జనవరిలో 1,40,321 రేషన్‌కార్డులు, 5,08,503 మంది కుటుంబసభ్యులు ఉండగా.. అక్టోబర్‌లో 1,40,322 కార్డులు, 5,08,439 మంది కుటుంబసభ్యులకు చేరింది. ఈ లెక్కన 64 మంది పేర్లు తొలగించారు.
- వనపర్తి జిల్లాలో ఈ ఏడాది జనవరిలో 1,57,103 రేషన్‌కార్డులు, 5,16,465 మంది కుటుంబసభ్యులు ఉండగా.. అక్టోబర్‌లో 1,57,097 కార్డులు, 5,16,055 మంది కుటుంబసభ్యులకు చేరింది. ఈ లెక్కన 6 కార్డులు, 410 మంది పేర్లు తొలగించారు.

బదిలీల పరంపర

- విద్యుత్‌శాఖలో ముగ్గురు ఏఈలకు ఏడీలుగా..
- ఏడీకి డీఈగా పదోన్నతి, 35 మందికి స్థానచలనం

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ, అక్టోబర్ 14 : విద్యుత్ శాఖలో బదిలీల పరంపర కొనసాగుతున్నది. ఇప్పటికే ఉమ్మడి జిల్లాలో 166 మందికి పండుగ పూట బదిలీలు కాగా.. సోమవారం ఏడీ, ఏఈ, డీఈలకు స్థానచలనం జరిగింది. ఇందులో కొందరికి పదోన్నతులు వరించాయి. మహబూబ్‌నగర్ సర్కిల్ పరిధిలో ఏఈగా పనిచేస్తున్న జగన్మోహన్‌కు ఏడీగా పదోన్నతితో పాటుఅచ్చంపేటకు బదిలీ అయ్యారు. ఎంఆర్‌టీ ఏఈగా పనిచేస్తున్న రవీంద్రమోహన్‌కు ఏడీగా పదోన్నతి రాగా వనపర్తికి ట్రాన్స్‌ఫర్ అయ్యారు. ఐసీఎస్ఈ ఏఈగా సర్కిల్‌లో పనిచేస్తున్న మాధవికి ఏడీగా పదోన్నతి రాగా.. నాగర్‌కర్నూల్ జిల్లా కన్స్ట్రక్షన్ ఏడీగా పోస్టింగ్ ఇచ్చారు. జోగుళాంబ గద్వాల ఏడీ నాగరాజు డీఈగా పదోన్నతిపై మహబూబ్‌నగర్‌కు వెళ్లారు. డీఈ భాషా మెదక్ జిల్లాకు బదిలీ కాగా ఆయన స్థానంలో వనపర్తి నుంచి రాచప్ప మహబూబ్‌నగర్‌కు వచ్చారు. జడ్చర్ల డీఈ కృష్ణమూర్తి కందుకూరు రాజేంద్రనగర్ సర్కిల్‌కు.., డీఈ సుబ్బారావు హబ్సిగూడకు బదిలీ అయ్యారు. ఉమ్మడి జిల్లాలో మొత్తం ఏడుగురు ఏడీలు, 23 మంది ఏఈలు, 5 మంది డీఈలకు స్థానచలనం కలిగింది.

కొందరికే అనుకూలమైన స్థానాలు..

బదిలీలు పూర్తి పారదర్శకంగా చేపట్టామని చెబుతున్నా.. కొన్ని సంఘాల బాధ్యులకే ఎక్కువగా అనుకూలమైన స్థానాలు కేటాయించలేని ఎస్సీ, ఎస్టీ విద్యుత్ ఉద్యోగ సంఘాల నాయకులు ఎస్ఈ పీవీ రమేశ్‌కు సోమవారం ఫిర్యాదు చేశారు. వివిధ కేటగిరీల్లో నిబంధనలకు అనుగుణంగా చేపట్టాల్సిన బదిలీల్లో అనుకూలంగా ఉన్నవారికే పోస్టింగ్‌లు ఇవ్వడంతో అర్హులు, వితంతువులకు అన్యాయం జరిగిందన్నారు. ఏడేండ్లకు పైగా గ్రామీణ ప్రాంతాల్లో పనిచేస్తున్న వారిని పట్టణ ప్రాంతాలకు తీసుకొచ్చే అవకాశం ఉన్నా అలా చేయడలేదని ఆరోపించారు. ఈ విషయంలో నిబంధనలకు లోబడి చర్యలు తీసుకోకుంటే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

కొత్తగా బాధ్యతలు చేపట్టిన అధికారులతో మాట్లాడుతున్న ఎస్ఈ పీవీ.రమేశ్

రైతు పరశురాముడి నుంచి పురుగుల మందు డబ్బాను బలవంతంగా తీసుకుంటున్న పోలీసులు

రైతు ఆత్మహత్యాయత్నం

- పురుగుల మందు తాగుతుండగా అడ్డుకున్న పోలీసులు
- గద్వాల దవాఖానకు తరలింపు

గద్వాల, అక్టోబర్ 14 : తన తండ్రి పేరుపై ఉన్న భూమిని కొందరు ఆక్రమించాలంటూ అతడి కుమారుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన జోగుళాంబ గద్వాల జిల్లాలో చోటు చేసుకున్నది. అయిజ మండలం గుడిదొడ్డి గ్రామానికి చెందిన వడ్డె సవారన్నకు యాపదిన్నె శివారులోని 321 సర్వే నెంబర్‌లో ప్రభుత్వం 1986 సంవత్సరంలో ఐదెకరాల పొలం ఇచ్చింది. ఈ భూమిని ఆయన మరణానంతరం కుమారులు వడ్డె పరశురాముడు, వడ్డె తిమ్మప్ప, వడ్డె కృష్ణ సాగు చేసేవారు. అయితే, ఆ తర్వాత సవారన్న పేరుపై ఉన్న పొలాన్ని అతడి కొడుకుల పేరుపై అధికారులు ఎక్కించలేదు. దీంతో తమకు తెలియకుండా అట్టి భూమిని చుట్టుపక్క పొలాల రైతులు ఆక్రమించుకొని.. బెదిరిస్తున్నారని ముగ్గురు కుమారులు వాపోయారు. ఈ విషయంపై పలుమార్లు కలెక్టర్, తాసీల్దార్, పోలీసులకు ఫిర్యాదు చేసినా న్యాయం జరగలేదన్నారు. హైకోర్టును ఆశ్రయించగా.. భూమిని సర్వే చేసి నివేదిక ఇవ్వాలని ఏడీ, సర్వేయర్‌ను ఆదేశించారని తెలిపారు. ఆ తర్వాత పొలంలో మోక మీద మేము లేమంటూ అధికారులు తప్పుడు రిపోర్ట్ ఇచ్చారని, ఆ తర్వాత ధరణి పోర్టల్‌లో వేరేవారి పేర్లను అక్రమంగా చేర్చారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదేమని అడిగితే అదే గ్రామానికి చెందిన భూమిని ఆక్రమించిన ఐదుగురు (లోకేశ్వర్‌రెడ్డి, చావలి గోవిందమ్మ, సి.సత్యారెడ్డి, చాకలి శంకరన్న, ఎల్లారెడ్డి) బెదిరింపులకు పాల్పడుతున్నారని వడ్డె పరశురాముడు వాపోయారు.

ఇదే విషయమై సోమవారం జిల్లా కేంద్రంలో జరిగిన ప్రజావాణిలో అధికారులకు ముందు సదరు రైతులు వారి సమస్యను ఏకరువు పెట్టారు. కాగా, అధికారులను అడిగితే చచ్చినా భూమి మీ పేరుపైకి ఎక్కదని చెబుతున్నారని సవారన్న పెద్ద కొడుకు పరశురాముడు ఆందోళన చెందుతూ తన వెంట తెచ్చుకొన్న పురుగు మందును తాగే ప్రయత్నం చేశాడు. అక్కడే ఉన్న పోలీసులు అతడి అడ్డుకొని దవాఖానకు తరలించారు.

రైస్‌మిల్లుపై దాడి

- 19 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

ఖిల్లాఘణపురం, అక్టోబర్ 14 : మండల కేంద్రంలోని నవ్య దివ్య రైస్‌మిల్లుపై సోమవారం అధికారులు దాడులు చేసి 19 క్వింటాళ్ల రేషన్ బియ్యం, మారుతీ వ్యాన్‌ను సీజ్ చేశారు. ఎస్సై సురేశ్‌గౌడ్ కథనం మేరకు.. మహబూబ్‌నగర్‌కు చెందిన పుల్లూరి రాజు, పుల్లూరి వెంకటేశ్ రేషన్ బియ్యాన్ని కిలో రూ.15 చొప్పున పట్టణంలో కొనుగోలు చేశారు. సోమవారం ఉదయం నవ్య దివ్య రైస్‌మిల్లు యజమాని పాల్వాది లక్ష్మీనారాయణకు రూ.20 చొప్పున విక్రయించేందుకుగానూ 19 క్వింటాళ్ల బియ్యాన్ని మారుతి వ్యాన్(ఏపీ22ఎస్9992)లో తీసుకొచ్చారు. ఈ క్రమంలో పక్కా సమాచారంతో డిప్యూటీ తాసీల్దార్ నందకిశోర్ దాడులు జరిపారు. రేషన్ బియ్యంగా గుర్తించి ఖిల్లాఘణపురం పోలీస్‌స్టేషన్‌కు అప్పగించారు. దీంతో బియ్యం, మారుతీ వ్యాన్‌ను సీజ్ చేసి.. డీటీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

మారుతీ వ్యాన్‌ను స్వాధీనం చేసుకున్న దృశ్యం

ముడా కార్యాలయంలో చేరిన గొర్రెలు

ముడా ఆఫీస్ ఖాళీ.. ఆవరణలో గొర్రెల లొల్లి

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ, అక్టోబర్ 14 : మహబూబ్‌నగర్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(ముడా) కార్యాలయంలోని అన్ని విభాగాల్లోనూ సోమవారం ఖాళీ కుర్చీలే దర్శనమిచ్చాయి. అయితే, కార్యాలయం బయట మాత్రం గొర్రెలు బారులు దీరాయి. ఈ ఆఫీస్ కింది అంతస్తులోనే పబ్లిక్ హెల్త్ మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగ డివిజన్ కార్యాలయం ఉండడం విశేషం. రెండు ప్రభుత్వ కార్యాలయాలు ఒకేచోట ఉన్నా.. పూర్తి స్థాయిలో సిబ్బంది విధుల్లో లేరు. ముడా కార్యాలయంలో ఏపీవో, సీపీవోగా ఒకే అధికారి బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఆఫీసర్ కూడా అందుబాటులో లేడు. ఇద్దరు ఆఫీస్ సబార్డినేటర్లు మాత్రమే ఉన్నారు. వివిధ పనులు, ప్రాజెక్టుల నిమిత్తం వచ్చిన వారు అధికారుల ఫోన్ నెంబర్ తీసుకొని.. వారి నెంబర్లు ఇచ్చి వెళ్లారు.

కాజ్‌వే.. కుంగిపాయే..

- వర్షాలకు దెబ్బతిన్న మొల్గర–ఉల్పర రోడ్డు
- దుందుభీ నదిపై నిలిచిన రాకపోకలు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు, విద్యార్థులు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

వరదలకు కుంగిపోయిన మొల్గర కాజ్‌వే

ఉప్పునుంతల, అక్టోబర్ 14 : ఉప్పునుంతల, వంగూరు మండలాల సరిహద్దు ప్రాంతమైన మొల్గర–ఉల్పర గ్రామాల మధ్య దుందుభీ నదిపై నిర్మించిన కాజ్‌వే కుంగిపోయింది. 15 రోజుల కిందట కురిసిన వర్షాలతో కాజ్‌వే డ్యామేజ్‌కాగా.. రాకపోకలకు ఇబ్బంది కలగకుండా తాత్కాలికంగా మొరం పోశారు. అయితే, మూడు రోజులుగా దుందుభీ నదికి మళ్లీ వరద ఉధృతి పెరగడంతో కాజ్‌వే పూర్తిగా దెబ్బతిన్నది. సీసీ రోడ్డు పూర్తిగా తెగిపోయింది. ఈ క్రమంలో అచ్చంపేట నుంచి మొల్గర, ఉల్పర మీదుగా కల్వకుర్తికి వెళ్లే ఆర్టీసీ బస్సులను అధికారులు రద్దు చేశారు. దీంతో ఉప్పునుంతల–వంగూరు మండలాలకు చెందిన 20 గ్రామాల ప్రజలు, కల్వకుర్తి, అచ్చంపేట పట్టణాల్లో ఇంటర్, డిగ్రీ.. ఉప్పునుంతల, రంగాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో చదివే విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. హైదరాబాద్‌కు వెళ్లేందుకు సమీప దారి కావడంతో.. కాజ్‌వే పైనుంచే ప్రయాణాలు కొనసాగిస్తుంటారు. ఈ క్రమంలో అది పూర్తిగా దెబ్బతినడంతో గత్యంతరం లేక చింతపల్లి మీదుగా చుట్టూ తిరిగి వెళ్తున్నారు. రూ.30లక్షల వ్యయంతో తాత్కాలిక మరమ్మతులు చేపట్టినా.. ఏడాది గడవక ముందే డ్యామేజ్ కావడంతో అసహనం వ్యక్తం చేస్తున్నారు. కేసీఆర్ ప్రభుత్వం రోడ్లకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ.. రాకపోకలు సజావుగా జరిగేందుకు కృషి చేసిందని, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రోడ్లను పూర్తిగా విస్మరించిందని బాహాటంగా విమర్శిస్తున్నారు. సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి మొల్గర వద్ద హైలెవల్ బ్రిడ్జి నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.